తేది: 23.03.2017

ద్రావిడ విశ్వవిద్యాలయం సిడిఎల్‌పి విభాగం డా.ఎన్.సుశీల గారి ఆధ్వర్యంలో "దక్షిణ భారతదేశంలో 18-19వ శతాబ్దాల్లో వచ్చిన సాహిత్య, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం" అన్న అంశంపై రెండు రోజుల యు.జి.సి జాతీయ సదస్సును ఎమెనో భవనంలో గురువారం ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన **వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు** మాట్లాడుతూ... సాహిత్యం ద్వారానే మానవ విలువలను పెంపొందించవచ్చని తెలియజేశారు. చారిత్రకంగా, రాజకీయంగా దక్షిణ భారతదేశంలో వచ్చిన మార్పులను అధ్యయనం చేయడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సదస్సులో **మైసూరు విశ్వవిద్యాలయం ఆచార్య శేఖర్ గారు కీలకోపన్యాసం చేస్తూ...** మనిషికి సహనం అతి ముఖ్యమైనదని, "కవి రాజమార్గం"లో అన్ని ధర్మాలను సమదృష్టితో చూడటం అనేది అన్నింటికంటే అత్యుత్తమమైనదని తెలియజేశారు. భారతదేశంలో పునరుజ్జీవన ప్రక్రియకు రాజారామమోహన్‌రాయ్, వివేకానంద, స్వామి దయానంద సరస్వతులు ఆద్యులని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో శ్రీ నారాయణ గురు, పెరియార్ రామస్వామి వంటి వారు స్త్రీల అభ్యున్నతి కోసం, బడుగు బలహీన వర్గాల వారికోసం పాటుపడ్డారని, కర్ణాటకలో బసవన్న, అల్లిమప్రభు, అక్కమహాదేవి వంటి వారు తమ వచన సాహిత్యం ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపే ప్రయత్నం చేశారని తెలియజేశారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన కువెంపు వారు 'అనికేతన' అనే పద్యం ద్వారా వసుధైక కుటుంబం గురించి తెలియజేస్తూ, సంకుచిత భావాలను విడనాడాలని కోరారు. అనంతరం సదస్సు సంచాలకులు డా.ఎస్.సుశీల సదస్సు లక్ష్యాలను వివరించారు. ఈ సదస్సుకు వర్శిటీ రెక్టార్ ఆచార్య జి.బాలసుబ్రమణియన్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఎస్. పెంచలయ్య, వివిధ శాఖల పీఠాధిపతులు, శాఖాధిపతులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



